TEL:T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు    తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

పబ్లిషర్ : హైదరాబాద్   సంపుటి :01   సంచిక : 149   బుధవారం 22-01-2025   పేజీలు :06   వేల : 05/-

# ప్రజావాణిలో 5,736 దరఖాస్తులు

## - ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తుల వెల్లువ



**హైదరాబాద్ (మన వెలుగు) జనవరి 21 :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 5,736 దరఖాస్తులు అందాయి.ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులు చేసుకునేందుకు ప్రజలు బారులు తీరారు. ప్రజా భవన్ నుంచి బయట రోడ్డు జ్యూవెలరీ దుకాణాల వరకు ప్రజలు క్యూ కట్టారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 132, విద్యుత్ శాఖ కు సంబంధించి 131, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 43, ప్రవాసి ప్రజావాణికి సంబంధించి 01, ఇందిరమ్మ ఇండ్లు పథకం కోసం 5,332 దరఖాస్తులు వచ్చాయి, ఇతర శాఖలకు సంబంధించి 97 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్. జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి అధికారి శ్రీమతి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొని ఓపికతో దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్ కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

# సమస్యలకు కేరాఫ్ గా హైదరాబాద్

## - రోజురోజుకూ పెరిగిపోతున్న పారిశుధ్య సమస్య, తాగునీటి

## - తండ్లాట, విద్యుత్ కోతలు, ట్రాఫిక్ సమస్య

## - బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు

## - హైదరాబాద్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం

**హైదరాబాద్ (మన వెలుగు) జనవరి 21 :** తెలంగాణ రాష్ట్రానికి గుండెకాయ అయిన హైదరాబాద్ ఏడాదికాలంగా సమస్యల సుడిగుండంలో చిక్కుకుందన్నారు భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారకరామారావు. సీఎంగా కేసీఆర్ సారథ్యంలో హైదరాబాద్ సంతోషానికి చిరునామాగా ఉంటే.. నేడు రేవంత్ సర్కార్ పాలనా వైఫల్యంతో సవాలక్ష కష్టాలకు కేరాఫ్ గా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. జూబ్లీహిల్స్ లోని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసంలో ఇవాళ హైదరాబాద్ లోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేటీఆర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. హైదరాబాద్ ప్రజలు ఏడాది కాలంగా నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న పారిశుధ్య ఇబ్బందులను, తాగునీటితోపాటు ఇతర సమస్యలను ఎమ్మెల్యేలు కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. ఎండాకాలం రాకముందే అనేక ఏరియాల్లో వాటర్ ట్యాంకర్లు దర్శనమిస్తున్న సంగతిని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా ప్రస్తావించారు. వేళాపాళా లేని కరెంటు కోతలతో వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక రంగాలు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. దీంతో పాటు బీఆర్ఎస్ పాలనలో సేఫ్ సిటీకి బ్రాండ్ గా ఉన్న హైదరాబాద్, క్రైమ్ సిటీగా మారడం, మళ్లీ పెరుగుతున్న భూకబ్జాలతో పాటు గాలికొదిలేసిన లా అండ్ ఆర్డర్ తో నగర ప్రజల్లో రోజురోజుకు పెరుగుతున్న అభద్రతాభావంపై కేటీఆర్ తో ఎమ్మెల్యేలు సుదీర్ఘంగా చర్చించారు.



ఈ సందర్భంగా హైదరాబాద్ సమస్యల పరిష్కారం, నగర ప్రజలకు కలిగించాల్సిన భరోసాపై ఎమ్మెల్యేలకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ పాలన హైదరాబాద్ నగరానికి స్వర్ణయుగం అన్న కేటీఆర్, మెట్రో రైలు, సివరేజీ ప్రాజెక్టులు, ఐటీ వృద్ధి, ప్రపంచ స్థాయి ప్రాజెక్టులు నగర రూపురేఖల్ని మార్చి దేశానికే గర్వకారణంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దామన్నారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ అమలుచేసిన సమగ్రమైన ప్రణాళికలతో హైదరాబాద్ లో శాంతిభద్రతలు చెక్కుచెదరకుండా ఉన్నాయన్న కేటీఆర్, ప్రస్తుత ప్రభుత్వానికి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని కాపాడాలన్న సోయి కూడా లేకపోవడం దురదృష్టకరం అన్నారు. నియోజక వర్గంలో ఏ కార్యక్రమానికి వెళ్లినా కాంగ్రెస్ పాలనలో ఎదుర్కొంటున్న దురావస్థ గురించే హైదరాబాదీలు చెబుతున్నారని ఎమ్మెల్యేలు కేటీఆర్ కు వివరించారు. ప్రధానంగా బస్తీ వాసులు సమస్యల సుడిగుండంలో చిక్కుకుని విలవిలలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీ కూడా హైదరాబాద్ లో అమలుకావడం లేదన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం ఏడాది కాలంగా హైదరాబాద్ లోని పేదలు ఎదురు చూస్తున్నారన్నారు. బీఆర్ఎస్ హయంలో హైదరాబాద్ రూపురేఖల్ని సమూలంగా మార్చిన విషయాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. హైదరాబాద్ వాసుల విలువైన సమయాన్ని ఆదా చేసే విధంగా వందేళ్ళ ముందు చూపుతో పెద్ద ఎత్తున ఫ్లైఓవర్ల నిర్మాణం చేపట్టామని, కరోనా సమయంలో కూడా యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తిచేసి ఫ్లైఓవర్లు, అండర్ పాస్ లను హైదరాబాదులో వాసులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. కొత్త రహదారుల నిర్మాణం, లింక్ రోడ్ల నిర్మాణంతో రద్దీ

2లో

# ముందుగా చెప్పినట్టుగానే జన్మతః పౌరసత్వంపై వేటు

## - క్యాపిటల్ హిల్‌పై దాడి కేసులో 1600 మంది మద్దతుదారులకు క్షమాభిక్ష

## - అమెరికా దేశాధ్యక్షుడి డోనాల్డ్ ట్రంప్ పలు ఎగ్జిక్యూటివ్ ఆదేశాలు జారి



**న్యూ డిల్లీ జనవరి 21:** అమెరికా దేశాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డోనాల్డ్ ట్రంప్ పలు ఎగ్జిక్యూటివ్ ఆదేశాలు జారీ చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి అమెరికా ఉపసంహరణ, క్యాపిటల్ హిల్‌పై దాడి కేసులో 1600 మంది మద్దతుదారులకు క్షమాభిక్ష వంటి ఆదేశాలు జారీ చేశారు. ఇక అమెరికా నేలపై జన్మించే వారికి హక్కుగా దక్కే పౌరసత్వానికి సంబంధించి కూడా కీలక నిర్ణయం తీసుకున్నారు.ముందుగా చెప్పినట్టుగానే జన్మతః పౌరసత్వంపై వేటు వేశారు. వలస వచ్చిన వారికి అమెరికా గడ్డపై పిల్లలు జన్మిస్తే స్వతహాగా లభించే పౌరసత్వాన్ని అందించే చట్టాన్ని రద్దు చేశారు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. అక్రమ వలసదారులకు అమెరికాలో జన్మించే పిల్లలకు లభించే జన్మతః పౌరసత్వాన్ని తమ ఫెడరల్ ప్రభుత్వం గుర్తించదని ఈ సందర్భంగా ట్రంప్ వ్యాఖ్యానించారు.బర్త్ రైట్ సిటిజన్‌షిప్ అంటే..అమెరికాలో జన్మించిన ప్రతి బిడ్డకు తల్లిదండ్రులు ఏ దేశం వారనేది సంబంధం లేకుండా ఆటోమేటిక్‌గా దేశ పౌరసత్వం దక్కుతుంది. దీనినే బర్త్ రైట్ సిటిజన్‌షిప్ అంటారు. ఏ వీసాపై అమెరికాకు వచ్చినా, ఆఖరికి అక్రమంగా వలస వచ్చిన తల్లిదండ్రులైనా సరే ఇక్కడ బిడ్డకు జన్మనిస్తే ఆ బిడ్డకు అమెరికా పౌరసత్వం లభిస్తుంది. 1868 నుంచి అమెరికాలో ఈ బర్త్ రైట్ సిటిజన్‌షిప్ అమలులో ఉంది. అమెరికా రాజ్యాంగం.. 14వ రాజ్యాంగ సవరణ ద్వారా జన్మతః పౌరసత్వాన్ని కల్పిస్తోంది.లక్షలాది మంది భారతీయులపై ప్రభావంబర్త్ రైట్ సిటిజన్‌షిప్ రద్దు నిర్ణయం అమెరికాలో ఉన్న లక్షలాది మంది భారతీయులపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ నిర్ణయంతో గ్రీన్‌కార్డులు, హెచ్-1బీ వీసాలపై అమెరికాలో ఉంటున్న భారతీయులు జన్మనిచ్చే పిల్లలకు అమెరికా పౌరసత్వం లభించదు. తల్లిదండ్రులకు పౌరసత్వం లభించడంపైనే పిల్లల పౌరసత్వం కూడా ఆధారపడి ఉంటుంది. పిల్లల పౌరసత్వం కోసం గ్రీన్ కార్డు ఉన్న తల్లిదండ్రులకు కొంత న్యాయపరమైన వెసులుబాటు ఉండే అవకాశం ఉందని, హెచ్-1బీ వీసా కలిసిన తల్లిదండ్రులకు మాత్రం బిడ్డల పౌరసత్వంపై గందరగోళం నెలకొంటుందని ఇమిగ్రేషన్ నిపుణులు చెప్తున్నారు. అమెరికా గ్రీన్‌కార్డుల కోసం లక్షలమంది భారతీయులు ఏండ్లుగా వేచి చూస్తున్నారు. ఇప్పుడు ట్రంప్ నిర్ణయంతో పౌరసత్వం రావడం పెద్ద కలగా మారింది. ఇప్పటివరకు పిల్లల పౌరసత్వంపై అయినా భరోసా ఉండేది. ఇప్పుడు అది కూడా పోయిందని అమెరికాలో ఉంటున్న భారతీయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# తాము అధికారంలోకి వస్తే కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య

## - బిజెపి తాజాగా మంగళవారం మరొక మేనిఫెస్టోను విడుదల

న్యూఢిల్లీ జనవరి 21 : ఢిల్లీ శాసనసభ ఎన్నికలకు సమయం సమీపిస్తోంది. ఎన్నికల్లో విజయం కోసం ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), భారతీయ జనతా పార్టీ (బిజెపి), కాంగ్రెస్ పార్టీలు వోటర్లను ఆకర్షించేందుకు హామీలను గుప్పిస్తున్నాయి. ఇప్పటికు మేనిఫెస్టోను ప్రకటించిన బిజెపి తాజాగా మంగళవారం మరొక మేనిఫెస్టోను విడుదల చేసింది. తాము అధికారంలోకి వస్తే అర్హులైన విద్యార్థులకు కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య సౌకర్యం కల్పిస్తామని బిజెపి వాగ్దానం చేసింది. పాలిటెక్నిక్‌ర ఐటిఐలలో టెక్నికల్ కోర్సులు చేస్తున్న షెడ్యూల్డ్ కులాల (ఎస్‌సి) విద్యార్థులకు భీమ్ రావ్ అంబేద్కర్ స్టైపెండ్ పథకం కింద ప్రతి నెల రూ. 1000 వంతున ఉపకార వేతనాలు అందజేస్తామని పార్టీ హామీ ఇచ్చింది.యుపిఎస్‌సి, రాష్ట్ర సివిల్ సర్వీస్ కమిషన్ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువతకు రూ. 15 వేల ఆర్థిక సాయం అందజేస్తామని పార్టీ ప్రకటించింది. ఒక ఆటో ట్యాక్సీ డ్రైవర్ సంక్షేమ మండలిని ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించిన బిజెపి డ్రైవర్లకు రూ. 10 లక్షల జీవిత బీమా, రూ. 5 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తామని వాగ్దానం చేసింది. అదే విధంగా ఇళ్లలో పని చేసే కార్మికుల కోసం సంక్షేమ మండలి ఏర్పాటుకు, అవే బీమా సౌకర్యాల కల్పనకు పార్టీ వాగ్దానం చేసింది. కేంద్ర మాజీ మంత్రి, బిజెపి సీనియర్ నేత అనురాగ్ ఠాకూర్ ఈ మేరకు బిజెపి సంకల్ప్ పత్ర పార్ట్ 2ను విడుదల చేశారు. ఆప్ హయాంలో చోటు చేసుకున్న కుంభకోణాలు, అవినీతిపై సిట్ ఏర్పాటు చేస్తామని అనురాగ్ ఠాకూర్ తెలియజేశారు.ఢిల్లీలో జల్ జీవన్ మిషన్ అమలులో విఫలమైనందుకు ఆప్ ప్రభుత్వాన్ని అనురాగ్ ఠాకూర్ విమర్శించారు. సంకల్ప్ పత్ర పార్ట్ 1ను బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా ఇటీవలే విడుదల చేశారు. గర్భిణీ స్త్రీలకు రూ. 21 వేల ఆర్థిక సాయం, మహిళా సమృద్ధి యోజన కింద ఢిల్లీలోని మహిళలకు నెలకు రూ. 2500 ఆర్థిక సాయం, పేద కుటుంబాలకు సబ్సిడీపై ఎల్‌పిజి సిలిండర్లను రూ. 500 ధరకే అందజేయడం వంటివి బిజెపి తొలి మేనిఫెస్టోలో ఉన్నాయి. మరొక వైపు బిజెపి మేనిఫెస్టోపై ఆప్ అధినేత అర్వింద్ కేజ్రీవాల్ స్పందిస్తూ, బిజెపి అధికారంలోకి వస్తే అర్హులైన విద్యార్థులకు మాత్రమే ఉచిత విద్య లభిస్తుందా అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో ప్రతి విద్యార్థికీ ఉచిత విద్య అభిస్తోందని ఆయన తెలిపారు. ఢిల్లీ ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కేజ్రీవాల్ కోరారు.



మన వెలుగు
TEL:T/TG/2024/0814
ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక
MANA VELUGU TELUGU DAILY



# సమస్యలకు కేరాఫ్ గా హైదరాబాద్

సమయాల్లో ట్రాఫిక్ ఇబ్బందుల్ని తీర్చి హైదరాబాద్ వాసుల అభిమానాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం సంపాదించుకుందని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వానికి తాము నిర్మించిన కట్టడాలు, నిర్మాణాల నిర్వహణ కూడా చేతకావడం లేదని విమర్శించారు. దెబ్బతిన్న రోడ్లను కనీసం రిపేర్ చేయకపోవడంతో వాహనదారులు రోడ్డు ప్రమాదాల బారిన పడడంతో పాటు ట్రాఫిక్ కష్టాలు నిత్యకృత్యమయ్యాని మండిపడ్డారు. చెత్త సమస్యను పరిష్కరించేందుకు హైదరాబాద్ లో ప్రవేశపెట్టిన స్వచ్ఛ ఆటోల ప్రయోగంతో విప్లవాత్మకమైన ఫలితాలను సాధించగలిగామని కేటీఆర్ చెప్పారు. కానీ నేడు హైదరాబాద్ లోని ఏ కాలనీ కి వెళ్లి చూసిన ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి కనిపిస్తుందన్నారు. ఫలితంగా ఈగలు, దోమల సమస్య పెరిగి ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. బిఆర్ ఎస్ హయంలో కంచెలు వేసి కాపాడిన ప్రభుత్వ పార్కులకు కూడా రేవంత్ సర్కార్ పాలనలో రక్షణ లేకుండా పోయిందని, అనేకచోట్ల కబ్జాలకు గురయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనా సామర్థ్యంపై హైదరాబాద్ ప్రజలకు నమ్మకం లేదన్న కేటీఆర్, ఆయనకు పాలన చేతకాదనే నిజాన్ని హైదరాబాద్ వాసులు పూర్తిగా అర్థం చేసుకున్నారని చెప్పారు. గత ఎన్నికల్లో కుల,మత, ప్రాంతాలకు అతీతంగా హైదరాబాదీలంతా పదేళ్ల అభివృద్ధికి పట్టం కట్టి బి ఆర్ ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను భారీ మెజారిటీలతో గెలిపించారని,హైదరాబాద్ ప్రజల నమ్మకానికి అనుగుణంగా వారి కష్టాలను తీర్చడమే ప్రథమ కర్తవ్యంగా పనిచేయాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సూచించారు . హైదరాబాద్ వాసుల కష్టాలు తీర్చేందుకు ఎప్పటికప్పుడు ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. రాష్ట్రానికి ఎకనామిక్ ఇంజన్ అయినా హైదరాబాద్ ఇమేజీ కాంగ్రెస్ పాలనలో దారుణంగా దెబ్బతిన్నదన్న కేటీఆర్, ఇది కేవలం హైదరాబాద్ కే కాకుండా యావత్ రాష్ట్రానికి మంచిది కాదన్నారు. పదేళ్లపాటు దేశంలోనే మోస్ట్ లవబుల్ సిటీ గా, లివెబుల్ సిటీగా అనేక ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ ర్యాంకింగ్ లో అగ్రభాగాన నిలిచిన హైదరాబాద్ గాడితప్పిన పాలన కారణంగా నేడు విలవిలలాడుతోందన్నారు. తెలంగాణ గ్రోత్ ఇంజన్ ను కాపాడుకోవాల్సిన బాధ్యత బీఆర్ఎస్ పైనే ఉందని ఎమ్మెల్యేలకు ఎమ్మెల్సీలకు కేటీఆర్ దిశా నిర్దేశం చేశారు. గ్రామసభలు, వార్డు సభల పేరిట మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ సర్కారు, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదలందరికీ రేషన్ కార్డులు, ఇళ్లు, పింఛన్లు ఇవ్వాలని, లేకపోతే బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఊరుకునే ప్రసక్తే లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలంగాణ కు వెన్నుముక్కైన హైదరాబాద్ అభివృద్ధిని గాలికొదిలేసిన కాంగ్రెస్ సర్కారుకు నగర ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని కేటీఆర్ హెచ్చరించారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఆరెకపూడి గాంధీ

**శేర్లింగంపల్లి (మన వెలుగు) జనవరి 21:** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకొనగా 33 మంది లబ్ధిదారులకు (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన 17,93,000/- పది హేడు లక్షల తొంభై మూడు వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి బాధిత కుటుంబాలకి అందచేసిన పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని గాంధీ పునరుద్ఘాటించారు . అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను



అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు , అభాగ్యులకు అండగా..సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని గాంధీ ఈ సందర్భంగా తెలియచేశారు. పేద మధ్యతరగతి ప్రజలకు ఆసుపత్రిలో బిల్లులు కట్టలేని పరిస్థితిలో ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ ఆర్థిక సాయంని అందిస్తుందని దీనిలో భాగంగానే నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు ఎన్నో వందలాది కుటుంబాలను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకున్నామని తెలిపారు. గతంలో ఉన్న బిల్లులకు అనుగుణంగానే ప్రస్తుతం ఆర్థిక సాయం అందిస్తుందని దానిని మరింత పెంచేలా కృషి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి త్వరలోనే కలిసి వినతి పత్రాన్ని అందజేస్తానని ,మరింత ఆర్థిక సహాయం పెంచితే పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది అని చైర్మన్ గాంధీ అన్నారు.ఈ సందర్భంగా వైద్య చికిత్స కి సహకారం అందించిన చైర్మన్ ఆరెకపూడి గాంధీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము అని బాధితుల కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాంబశివరావు, చంద్రిక ప్రసాద్ గౌడ్,కావూరి అనిల్,ఎల్లం నాయుడు,చిరుమూర్తి రాజు, సల్లావుద్దీన్,రాము,సాయి తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ కొయ్య బొమ్మలకు ప్రపంచ ఖ్యాతి

### -తెలంగాణ హస్తకళ చైర్మన్ నాయుడు సత్యనారాయణ

**ముధోల్ (మన వెలుగు) జనవరి 21 :** నిర్మల్ జిల్లా ప్రధాన కేంద్రంలోని నిర్మల్ కొయ్య బొమ్మల కేంద్రాన్ని తెలంగాణ హస్తకళ చైర్మన్ నాయుడు సత్యనారాయణ సందర్శించారు.కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు సమత సుదర్శన్, ఇతర కార్యకర్తలతో సందర్శనలో పాల్గొన్న ఆయన మాట్లాడుతు ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో నియోజకవర్గానికి ఒక స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తుందని అందులో భాగంగా స్కిల్ యూనివర్సిటీలో హస్తకళ నైపుణ్యాన్ని ఒక కోర్సుగా ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని



పేర్కొన్నారు.గత కెసిఆర్ ప్రభుత్వ హాయంలో హస్తకళ మరుగున పడిందని నిధులు కేటాయించలేక ప్రస్తుతం కళా నైపుణ్యం కనుమరుగయ్యే పరిస్థితికి చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొయ్య బొమ్మల కేంద్రంలోని సిబ్బంది తమ యొక్క సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకురాగా ప్రభుత్వం తప్పకుండా తమ సమస్యలను తీరుస్తుందని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా వారి వెంట సమత ఫౌండేషన్ చైర్మన్ (కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు) సమత సుదర్శన్,తెలంగాణ హ్యాండీక్రాప్ డిప్యూటీ మేనేజర్ శ్రీపాణి, మేనేజర్ బిఆర్ శంకర్, ప్రెసిడెంట్ పెంటయ్య, నాయకులు సాహెబ్ రావ్, యోగేష్ ,రతన్, గడ్డం శ్రీనివాస్,టీఎన్జీవో అధ్యక్షులు ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగులను మోసం చేసిన ప్రభుధుడు


**కూకట్పల్లి (మన వెలుగు) జనవరి 21:** అమాయక నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇప్పిస్తానని ఎరవేసి లక్షల్లో డబ్బులు వసూలు చేసిన ఓ ప్రభుధుడు పోలిసులకు చిక్కకుండా తన తెలివితేటలను ప్రదర్శించి గేమ్ చేంజర్ గా అవతారం ఎత్తుతున్నాడు. ఈ ప్రభుధునికి ఓ కానిస్టేబుల్ అభయ హస్తాన్ని ఇస్తూ ముందుకు సాగిపో అంటూ ప్రోత్సహిస్తున్నాడు. మోసపోయిన యువకులు పోలీసు స్టేషన్లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా "మేము మాట్లాడుకుంటాము సార్" అని చాకచక్యంగా పోలీసుల చేతి నుండి తప్పించు కోవడమే అతనికి ఉన్న ప్రత్యేకత. ఈ విధంగా అనేక మందిని పోలీసు స్టేషన్లో కేసు నమోదు కాకుండా ఎంతో జాగ్రత్తలు తీసుకుంటున్నాడు. బాలానగర్ లోని ఫిరోజ్ గూడలో నివసించే సందీప్ యాదవ్ అనే వ్యక్తి స్థానికంగా కొంత మంది నిరుద్యోగ యువకులకు సాఫ్ట్ వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని హైదరాబాద్ నగరానికి వచ్చి ఉద్యోగాల కోసం వెతుక్కుంటున్న స్థానికంగా ఉన్న కొంత మంది ఆంధ్రా ప్రాంత యువకులకు గాలం వేశాడు. అమాయక యువకులు



అతని మాయమాటలు నమ్మి వాళ్ళ ఊరిలో అప్పులు చేసి ఒక్కొక్కరు లక్షల రూపాయలు తీసుకొచ్చి సందీప్ యాదవ్ కు ముట్టజెప్పారు. ఎన్ని రోజులైనా ఉద్యోగాలు ఇప్పించడం లేదు. ఇదిగో వచ్చేస్తుంది... అదిగో వచ్చేస్తుంది అంటూ కాలయాపన చేస్తున్నాడు. గట్టిగా అడిగితే రేపు ఆఫర్ లెటర్ వస్తుంది అని నమ్మబలికి ఫేక్ కంపెనీ లెటర్ పై ఫలానా జాబ్ కు రమ్మని ఒక లెటర్ ఇస్తాడు. ఆ కంపెనీ లోని ఎవరినో ఒకరిని పట్టుకుని డూప్ ఇంటర్వ్యూ ఇప్పించే విధంగా ప్రక్రియను పూర్తి చేస్తాడు. తీరా అక్కడ ఏమీ ఉండదు. మోసపోయాం అంటూ యువకులు పోలీసు స్టేషన్ చుట్టూ తిరుగుతారు, ఆపై రాయబారాలు. ఎక్కువగా మాట్లాడితే బోయిన్ పల్లి పోలీసు స్టేషన్ లో కానిస్టేబుల్ గా పనిచేసే వెంకటేశ్వర్లు తో దబాయిస్తాడు. ఇకపై సందీప్ యాదవ్ కు చెయ్యకు తనకే ఫోన్ చెయ్యమని కానిస్టేబుల్ తాపీగా చెబుతాడు. ఇప్పుడు ఈ మోసపోయిన నిరుద్యోగ యువకులంతా ఇటు పోలీసు స్టేషన్ లో కేసు నమోదు కాకుండా అటు డబ్బులు ఇస్తా అన్న సందీప్ యాదవ్ డబ్బులు ఇవ్వక అడకత్తెరలో పోకచెక్క మాదిరి అయిపోయారు.

## పరికి చెరువు హద్దులు నిర్ణయించేంత వరకు నిర్మాణాలు ఆపండి

**కుత్బుల్లాపూర్ (మన వెలుగు) జనవరి 21 :** కలెక్టర్ , ప్రభుత్వ రికార్డుల ప్రకారం పరికి చెరువు విస్తీర్ణం 60.84 ఎకరాలుగా ఉందని కాని నేడు అది మొత్తం మాయం అయ్యిందని కావున వెంటనే నిర్మాణాలను ఆపివెయ్యాలని కోరుతూ సోమవరం నాడు జరిగిన ప్రజావాని లో హైడ్రా కమీషనర్ రంగనాథ్కు సిపిఐ నాయకులు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ కార్యదర్శి ఉమా మహేష్ పరికి చెరువు విస్తీర్ణం,ఎఫ్ టి ఎల్ హద్దులు,ప్రభుత్వ సర్వే నంబర్లను,గతంలో ఉన్న ఫోటోలను ఇతర ఆధారాలను చూపించడం జరిగింది. అదే విదంగా పరికి చెరువును,గుట్ట పై ఉన్న భూములను హైడ్రా కమీషనర్ పర్యటించినప్పటికి నూతంగా బేస్మెంట్ నిర్మాణం జరిగిందని చెప్పగా,ఈ అరు నెలలుగా ఏ కొత్త నిర్మాణం అక్రమమని తెలితే కచ్చితంగా కూల్చివేస్తామని, బుధవారం నాడు అందరితో సమావేశం నిర్వహిస్తామని




కావున ఆ రోజు ఎలాంటి చర్యలు చేపట్టాలో నిర్ణయిద్దామని అన్నారు.ప్రజావానిలో హైడ్రా కమీషనర్ అన్ని వివరాలను అడిగి తెలుసుకోవడం తో పాటు ప్రతిదీ ఫోటో లో చూపెటడ్డం , అధికారులకు సమస్యపైన సమాచారం సేకరించి చర్యల కోసం ఆదేశించడం ఒక శుభాపరిణామని చర్యలు కూడా తీసుకుంటే చెరువులను,భూములను కాపాడుకోవచ్చని సిపిఐ నాయకులు భావించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్,కార్యవర్గ సభ్యులు రాములు, కే.వెంకటేష్, నాయకులు సామెల్,నరేందర్ లు పాల్గొన్నారు.

## రాజారా గ్రామంలో విద్యార్థులకు ఉచిత టై, బెల్ట్, గుర్తింపు కార్డులు

**లోకేశ్వరం (మన వెలుగు) జనవరి 21:** మండలంలోని రాజారా గ్రామంలో, ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఐటీఐ అనిల్ తన సొంత ఖర్చులతో టై, బెల్ట్, గుర్తింపు కార్డులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రయత్నించి, చదువు కంటే అధికమైన లక్ష్యాలను సాధించే అవకాశం ఉందని ప్రేరణ ఇచ్చారు. విద్యార్థులు చదువుతూనే విజయాలను సాధించాలని



సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక %బా×% అశోక్, ముత్త గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పై దుష్ప్రచారం చేస్తే సహించం

### - బిజెపి మండల అధ్యక్షుడు కోరిపోతన్న

**ముధోల్ (మన వెలుగు) జనవరి 21:** ప్రజల కోసం నిరంతరంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్ పై, బిజెపి పార్టీపై దుష్ప్రచారం చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని ముధోల్ బీజేపీ మండల అధ్యక్షులు కోరి పోతన్న అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన ముధోల్లో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటున్న ఎమ్మెల్యే పై పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తే సహించబోమన్నారు. ఇకనైనా తీరు మార్చుకోవాలని, ప్రచారం చేసిన చానళ్లపై చట్టపరంగా వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. ముధోల్ నియోజకవర్గం లో గతంలో ఎన్నడు జరిగిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే చేపట్టడం ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని పేర్కొన్నారు. విద్యా వ్యవసాయం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ ఎలాంటి పక్షపాతానికి తావు లేకుండా



ముందుకు వెళ్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే పై దుష్ప్రచారం చేసేముందు ఒక్కసారిగా ఆలోచించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పిఎసిఎస్ డైరెక్టర్ ధర్మపురి సుదర్శన్, మాజీ ఎంపీటీసీలు లక్ష్మి నారాయణ, జ్యోతిదేవన్న, బీజేపీ నాయకులు సతీష్ రెడ్డి, ధర్మపురి శ్రీనివాస్, సప్పటోళ్ల పోతన్న, గంగా ప్రసాద్ , బాలాజీ(బాలు ), తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేకు వసంత పంచమి ఆహ్వాన పత్రిక అందజేత

**ముధోల్ (మన వెలుగు) జనవరి 21 :** దక్షిణ భారతదేశంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధిలో ప్రతి సంవత్సరం దేవస్థానం ఆధ్వర్యంలో వసంత పంచమి వేడుకలు వైభవంగా నిర్వహిస్తారు. వచ్చేనెల 1నుండి 3వరకు నిర్వహించి వసంత పంచమి ఉత్సవ ఆహ్వాన పత్రికలు- గోడప్రతులను ముధోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అదేవిధంగా ఉత్సవాలకు ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఎమ్మెల్యేకు ఉత్సవ ఆహ్వాన పత్రంతో పాటు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందించి వేద పండితులు ఆశీర్వదించారు. భక్తులు ఉత్సవాలకు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. అదే విధంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు విస్తృతంగా ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి నవీన్ కుమార్, పిఆర్ఓ నారాయణ పటేల్, దేవస్థాన వైదిక బృందం ఉప ప్రధాన అర్చకులు శ్రీపాదరావు దీక్షిత్, వేద పండితులు సంజయ్ ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.



# సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ

## -అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందిస్తాం

**ముధోల్ (మన వెలుగు) జనవరి 21:** సంక్షేమ పథకాలు అమలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్పష్టం చేశారు.మంగళవారం నిర్మల్ పట్టణంలోని నాయిడివాడ, నిర్మల్ గ్రామీణ మండలం న్యూ పోచంపాడ్ గ్రామంలో నిర్వహిస్తున్న ప్రజా పాలన వార్డు, గ్రామ సభలలో కలెక్టర్ పాల్గొని ప్రజలకు, అధికారులకు పలు సూచనలు చేసారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 26 నుండి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల గురించి గ్రామస్తులకు వివరించారు. ఈ పథకాల కింద అర్హులను గుర్తించేందుకు వీలుగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించడం జరిగిందని కలెక్టర్ గుర్తు చేశారు. ముఖ్యంగా సాగుకు యోగ్యమైన భూములను పక్కాగా నిర్ధారించామని అన్నారు. పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతుకు ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ఎకరానికి 12 వేల రూపాయల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తుందని తెలిపారు. అదేవిధంగా సాగు భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రెండు విడతల్లో 12 వేల రూపాయలు అందించడం జరుగుతుందన్నారు. ఎలాంటి సాగు భూమి లేకుండా, కనీసం 20 రోజులు ఉపాధి హామీ పథకంలో పని చేసిన కుటుంబాలను అర్హులుగా గుర్తించామన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్ర పరిశీలన జరిపి, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులను నిర్ధారించామని తెలిపారు. ఈ మేరకు వివిధ పథకాల ద్వారా అర్హులుగా గుర్తించబడిన వారి వివరాలను గ్రామ సభలో అందరి సమక్షంలో చదివి వినిపించారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాల కోసం అర్హత కలిగిన వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఆయా పథకాల కింద ఇప్పటివరకు దరఖాస్తులు చేసుకోని వారితో పాటు, అర్హత కలిగి లబ్ధిదారుల జాబితాలో పేర్లు లేని వారి నుండి కూడా అర్జీలు స్వీకరించారు. వాటిని సమగ్రంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలు, అనవసర ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని అన్నారు. గ్రామ సభలలో దరఖాస్తులు అందజేయవచ్చని, వీలుపడని వారు ఈ నెల 26 తరువాత ఎప్పుడైనా మండల కార్యాలయాలలోని ప్రజా పాలన సేవా కేంద్రాలకు వెళ్లి సంబంధిత పత్రాలను జాతచేస్తూ దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. వచ్చిన ప్రతి దరఖాస్తును తప్పనిసరిగా పరిశీలించి, అర్హులందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని కలెక్టర్ భరోసా కల్పించారు.ఈ కార్యక్రమాలలో ఆర్డీవో రత్నా కళ్యాణి, డిఎస్ఓ కిరణ్ కుమార్, తహసిల్దార్లు రాజు, సంతోష్, ప్రజలు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతీ కుటుంబానికి న్యాయం చేస్తాం

## - కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు

**బాసర (మన వెలుగు) జనవరి 21 :** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం జనవరి 26 నుండి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 4 పథకాలు ఇందిరమ్మ ఇళ్లు,రేషన్ కార్డులు,రైతుభరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా విషయంలో ప్రజలు ఎవరు అందోళన చెందవద్దని పిలుపునిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల లబ్ధి జరుగుతుందని ఈరోజు నుండి గ్రామాల్లో గ్రామ సభలు ,వార్డు సభలు జరుగుతుండడంతో అక్కడికి వెళ్లి అధికారుల వద్దకు రేషన్ కార్డులు రానివారు కానీ ,ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక విషయంలో గ్రామ సభల్లోనే ఎంపిక చేయనున్నారని ఎవరికైనా అర్హత ఉండి రానివారు ఉంటే గ్రామ సభలో అప్లికేషన్ లు పెట్టుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నట్లు ప్రజలు ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దని వారు గత 10 సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు అయినా ఇవ్వలేదని గత పాలనపై ఆగ్రహం వ్యక్తం చేసారు.రైతు భరోసా పథకం ద్వారా ప్రస్తుతం ఉన్న 10 వేల రూపాయలను 12 వేలకు పెంచడం జరిగిందని దేశంలోనే మొదటి సారిగా భూమి లేని ఉపాధి హామీ రైతు కూలీలకు 12 వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆర్థిక భారం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రజా సంక్షేమ పథకాలు అందిస్తుందని ఇప్పటికే ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నాం,200 యూనిట్ల ఉచిత విద్యుత్,500 కి గ్యాస్ ఆరోగ్య శ్రీ నీ 5-10 లక్షలకు పెంచుతున్నామని రైతులకు 2 లక్షల లోపు రైతు రుణమాఫీ చేసి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే 55 వేల ఉద్యోగాలు భర్తీ చేశారని అదే విధంగా సన్న వడ్ల కు 500 బోనస్ ఇచ్చామని గతంలో ఎప్పుడు లేని విధంగా ధాన్యం సేకరణ చేసిన 48 గంటల్లోపు రైతుల ఖాతాలో డబ్బులు జమ చేశామని తెలియజేశారు.ఆర్థిక ఇబ్బందులు ఉన్న ఇప్పటికే అమలు చేస్తున్న పథకాల మాదిరి ఈనెల లోనే మరో 4 పథకాలు ప్రారంభం కానున్నాయని ప్రజలు ఎవరు అధైర్యపడవద్దని అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు వర్తిస్తాయని హామీ ఇచ్చారు.గ్రామాల్లో నేటి నుండి గ్రామ సభలు జరుగుతుండడంతో ఎవరికైనా అర్హత ఉండి రేషన్ కార్డు , ఇందిరమ్మ ఇళ్లు లబ్దిదారుల ఉంటే అధికారులకు మీ పూర్తి సమాచారాన్ని ఇవ్వాలని కింది స్థాయిలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రేషన్ కార్డుల , ఇందిరమ్మ ఇళ్ల పై జరుగుతున్న తప్పుడు సమాచారం నమ్మొద్దని ప్రజలు ధైర్యంగా ఉండాలని సూచించారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అండగా నిలబడాలని కోరారు.



# పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

## -జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**ముధోల్ (మన వెలుగు) జనవరి 21:** పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలాని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పదవ తరగతి పరీక్షలపై సమీక్ష సంబంధిత శాఖల అధికారులతో సమావేశం ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించేలా సన్నద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలలో మొత్తం 9127 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో నిర్మల్ జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలువడం జరిగిందని, ఈ సంవత్సరం కూడా ఉత్తమ ఫలితాలు సాధించాలని తెలిపారు. విద్యార్థులకు ఎప్పటికప్పుడు మధ్యంతర సన్నద్ధ పరీక్షలు నిర్వహిస్తూ బోర్డు పరీక్షలకు సిద్ధం చేయాలని సూచించారు. గణితం, ఇంగ్లీష్, సైన్స్, ఫిజిక్స్ సబ్జెక్ట్ లలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించాలని, ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ నిరంతరం ప్రత్యేక తరగతులను నిర్వహించాలని ఆదేశించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయాలని పరీక్షలకు సన్నద్ధ%శీ% చేయాలనీ సూచించారు. ప్రతి పాఠశాలలో ఈ నెల చివరి నాటికీ 10వ తరగతి సిలబస్ ను పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులను మానసికంగా దృఢంగా చేసి పరీక్షలపై భయాన్ని తొలగించాలని, పాఠాలను సులభంగా గుర్తుంచుకునే విధంగా మెలుకువలు నేర్పించాలన్నారు. సబ్జెక్టుల వారిగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులచే వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. పరీక్షలు సమీపిస్తున్నందున ప్రతి విద్యార్థి తరగతులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులు అధికారులు, ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేసి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. పరీక్షల నిర్వహణ, ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు శాతానికి సంబంధించిన వివరాల నివేదికలను ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. అనంతరం పాఠశాలల వారిగా పదవ తరగతి విద్యార్థుల సంఖ్య, ఇప్పటివరకు పూర్తి చేసిన సిలబస్, ప్రత్యేక తరగతుల నిర్వహణ, పరీక్షలకు సన్నద్ధమవుతున్న వివరాలను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డిఈఓ పి. రామారావు, సంక్షేమ శాఖల అధికారులు రాజేశ్వర్ గౌడ్, అంబాజీ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ లు పద్మ, సలోమి కరుణ, ఎంఈఓ లు, ప్రధానోపాధ్యాయులు, కేజీబీవి ప్రత్యేక అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

## -నిజమైన అర్హులకు సంక్షేమ ఫలాలను అందజేస్తాం

## -జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

**ములుగు ప్రతినిధి (మన వెలుగు) జనవరి 21:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్ అన్నారు. మంగళవారం ములుగు మండలంలోని జీవింతరావుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడి కేంద్రం లో నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్ తొ కలసి జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఈ నెల 26 నుండి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల గురించి గ్రామస్తులకు వివరించారు.అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ ఇప్పటికే పలు పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం మరో నాలుగు పథకాలను ఈ నెల 26 నుండి అర్హులకు అందించడానికి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 21 నుండి 24 వరకు గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ పథకాల కింద అర్హులను గుర్తించేందుకు వీలుగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించడం జరిగిందని కలెక్టర్ గుర్తు చేశారు. గ్రామ సభలు నిర్వహిస్తున్న సంబంధిత అధికారులు నిజమైన అర్హులను గుర్తించడానికి ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. గ్రామసభల అనంతరం ఎంపిక చేసిన అర్హులపై ఎలాంటి అభ్యంతరాలను అధికారులకు తెలియజేయాలని, పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరమే సంబంధిత పథకాల అర్హులను ప్రకటించడం జరుగుతుందని స్పష్టం చేశారు. సాగు భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రెండు విడతల్లో సాలీనా 12 వేల రూపాయలు అందించడం జరుగుతుందన్నారు. ఎలాంటి సాగు భూమి లేకుండా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులు పని చేసిన కుటుంబాలను అర్హులుగా గుర్తించామన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్ర పరిశీలన జరిపి, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులను నిర్ధారించామని తెలిపారు. ఆయా పథకాల కింద ఇప్పటివరకు దరఖాస్తులు చేసుకోని వారితో పాటు, అర్హత కలిగి లబ్ధిదారుల జాబితాలో పేర్లు లేని వారి నుండి కూడా అర్జీలు స్వీకరించారు.రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాల కోసం అర్హత కలిగిన వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. వాటిని సమగ్రంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడం జరుగుతుందని తెలిపారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలు, అనవసర ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని అన్నారు. గ్రామ సభలలో దరఖాస్తులు అందజేయవచ్చని సూచించారు. వచ్చిన ప్రతి దరఖాస్తును తప్పనిసరిగా పరిశీలించి, అర్హులందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని కలెక్టర్ భరోసా కల్పించారు.సంబంధిత అధికారులు నిర్వహిస్తున్న గ్రామ సభలకు ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ అధికారి కొమురయ్య, ఎంపీ ఓ రహీం పంచాయితి కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

